సాక్షి
కుమురం భీం

ఆదివారం । 19 । నవంబర్ । 2023



ముగిసిన గుస్సాడీ సంబురాలు
15 రోజులుగా కొనసాగుతున్న గుస్సాడీ సంబురాలు శుక్రవారం ముగిశాయి. ఆదివాసీలు కోలబోడి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. 10లో▸



కూరగాయలతో ఆదాయం
చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో బెంగాలీ రైతులు కూరగాయల సాగుతో లాభాలు అర్జిస్తున్నారు. వ్యవసాయమే వీరికి జీవనాధారంగా మారింది. 11లో▸

గరిష్టం/కనిష్టం 33.2 /19.3

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం కాస్త మబ్బు పడుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు నలుగురు ఎంపిక



విద్యార్థులతో డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని డీటీడీవో రమాదేవి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో శనివారం డీఎస్‌వో మీనారెడ్డి, శిక్షకుడు తిరుమల్‌తో కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీటీడీవో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17 వరకు మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జట్టులో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు నందిని, సోని, సత్యశీల, నాగేశ్వరి జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయిలోనూ క్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, పీడీలు విద్యాసాగర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అజయ్

సిర్పూర్(టి): లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ యు.అజయ్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు పోలీసుస్టేషన్లలో ఉన్న కేసుల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను తక్షణమే పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సై రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న శారద

ఆసిఫాబాద్‌అర్బన్: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త శారద అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో లైంగిక వేధింపుల నిరోధక, నిషేధ, పరిష్కారం చట్టం- 2013పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, వ్యవస్థాపక రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేందుకు చట్టాలు తెలుసుకోవాలన్నారు. గృహ హింస నిరోధక చట్టం- 2005, తప్పనిసరి వివాహ నమోదు చట్టం- 2002, వరకట్న నిషేధ చట్టం- 1961, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టం- 1964, ఇతర చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఆర్థిక నిపుణులు సాగర్.. మహిళల అభివృద్ధికి బ్యాంకుల ద్వారా అందించే ఆర్థిక చేయూత పథకాలు, బీమా పథకాలు, నెట్ బ్యాంకింగ్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ అకౌంటెంట్ మమత, మెడికల్ ప్రాజెక్టు అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ..!



జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ప్రియాంకా గాంధీ సభ కోసం ఏర్పాట్లు

జంగ్ తెలంగాణ

- కుమురంభీం జిల్లాకు అగ్రనేతలు
- జోరందుకున్న పార్టీల ప్రచారం
- ఇప్పటికే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత
- నేడు ఆసిఫాబాద్‌కు రానున్న ప్రియాంకా గాంధీ
- 25న జిల్లాలో యూపీ సీఎం యోగి పర్యటన

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. అగ్రనేతలను రప్పించి సభలు నిర్వహిస్తున్నాయి. అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీకి చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు జిల్లాకు వరుస కడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఇక సిర్పూర్ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు తరపున ప్రచారం చేయడానికి యూపీ సీఎం యోగి ఈ నెల 25న ఆ నియోజకవర్గానికి విచ్చేస్తున్నారు.

సీఎం ఆశీర్వాద సభలు..
బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం కేసీఆర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. అదేసమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే అనేకచోట్ల ఎన్నికల సభల్లో ఆయన పాల్గొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ నేతలు రోడ్ షోలు.. సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ సభకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సభాస్థలి ఏర్పాటుతోపాటు షామియానాలు, కుర్చీలు సిద్ధం చేస్తున్నారు. అన్ని మండలాల నుంచి పార్టీ అభిమానులు, ప్రజలను తరలించేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. సభాస్థలిని శనివారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రియాంకా గాంధీ ఆదివారం ఉదయం 9.15 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.40 గంటలకు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి ప్రత్యేక చాపర్ ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ చేరుకుని, అక్కడ ఒంటి గంట వరకు బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. అక్కడి నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుని మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్‌లో జోష్
అధికార బీఆర్ఎస్ పార్టీకి దీటుగా కాంగ్రెస్ పార్టీ కూడా అగ్రనేతలను రంగంలోకి దింపి ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటికే రాహుల్, ప్రియాంకా గాంధీలు రాష్ట్రంలో పలు జిల్లాల్లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్, ఆసిఫాబాద్‌లో జరిగే బహిరంగ సభల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పాల్గొని ప్రసంగించనున్నారు. అలాగే కాంగ్రెస్ మరికొందరు స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దించనున్నట్లు తెలిసింది. ఆసిఫాబాద్ పట్టణంలో ఆదివారం నలభై వేల మందితో నిర్వహించే బహిరంగ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ముఖ్య అతిథిగా రానున్నారని పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ 'సాక్షి'కి తెలిపారు. సభకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల చరిత్ర తెలుసుకుని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

బీజేపీ తరపున యోగి..
బీజేపీ తమ పార్టీ అగ్రనేతలతో పాటు కేంద్ర మంత్రులను రంగంలోకి దింపుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలో డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయన తరపున ఇప్పటికే మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఈ నెల 25న బీజేపీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో విజయ సంకల్పం పేరుతో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఆయన పాల్వాయి హరీశ్‌బాబు విజయం కోసం కృషి చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బోర్కడే, పక్కన అధికారులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికల పరిశీలకులు మహిపాల్, సిర్పూర్, ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లు ఇబ్బందులు పడకుండా అన్నిఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండు అదనపు పోలింగ్ కేంద్రాలు
అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల సౌకర్యం కోసం జిల్లాలో రెండు అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ నియోజకర్గంలో 293 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 117వ పోలింగ్ కేంద్రం హుడ్కిలి నుంచి 117- ఏ అదనపు పోలింగ్ కేంద్రాన్ని ఇటిక్యాల పహాడ్‌లో ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 171వ పోలింగ్ కేంద్రం పంగిడిమాదర నుంచి 171- ఏ అదనపు పోలింగ్ కేంద్రాన్ని బుగ్గగూడలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా ప్రజలు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంప్‌లు, వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

- డీఎస్పీ వెంకటరమణ

వాంకిడి(ఆసిఫాబాద్): మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ అన్నారు. మండలంలోని సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఖమాన, వెల్గీం పోలింగ్ కేంద్రాలను సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఓటును ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకుని మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. యువత, గ్రామ ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోనుకావొద్దన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దని కోరారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తున్నామని, నిత్యం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

ఆధార్ తరహాలో 'అపార్'

- విద్యార్థులకు 12 నంబర్లతో గుర్తింపు సంఖ్య
- పీజీ వరకు పూర్తి వివరాలు ఒకేచోట నిక్షిప్తం
- విద్యాశాఖ నుంచి ఆదేశాలు జారీ
- ఎన్నికల నేపథ్యంలో నెమ్మదించిన ప్రక్రియ



పెంచికల్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం దేశంలోని పౌరులకు అందిస్తున్న ఆధార్ తరహాలోనే ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు దేశంలోని ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఐడీ అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయింపుపై ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి జిల్లా విద్యాశాఖకు సమాచారం అందించారు. అయితే ప్రస్తుతం ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉండటంతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఇలా..
జిల్లాలోని 1,263 పాఠశాలల్లో 93వేల మంది విద్యార్థులు, 48 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 11,173 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయా విద్యా సంస్థల్లోని విద్యార్థులందరికీ వారి తల్లిదండ్రుల అంగీకారంతో నూతనంగా ఐడీలు అందించడానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలోనూ తల్లిదండ్రులకు అపార్‌పై అవగాహన కల్పించారు.

ఒకే గుర్తింపు సంఖ్య..
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో చైల్డ్ ఇన్ఫో పేరిట ప్రత్యేక ఐడీ, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మరో ఐడీ కేటాయించి వివరాలను నమోదు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అపార్ ద్వారా కేజీ నుంచి పీజీ వరకు ఒకే ఐడీ కేటాయించి విద్యార్థి జీవిత కాలం ఒకే గుర్తింపు సంఖ్యలో వివరాలు నమోదు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. పాఠశాలలో అడ్మిషన్ పొందినప్పటి నుంచి చదువు పూర్తయ్యే వరకు విద్యార్థుల వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మోమోలు, ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు, ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న సమయంలో అపార్ ఐడీ నమోదు చేస్తే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

తల్లిదండ్రుల సమ్మతి అవసరం..
అపార్ ఐడీని పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి అపార్ ఉపయోగాలు వివరిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన ఐడీ భవిష్యత్తులో ఇష్టం లేకపోతే తొలగించుకునే అవకాశం సైతం కల్పించినట్లు చెబుతున్నారు.

విద్యార్థులకు ఉపయోగకరం

"అపార్ ఐడీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను ఐడీలో పొందుపరుస్తారు. దేశంలో ఎక్కడ చదివిన విద్యార్థికి అయినా ఒకే నంబర్ ఉంటుంది. విద్యార్థుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. తల్లిదండ్రుల అంగీకరంతో విద్యార్థులకు ఐడీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం."

– సైతం శంకర్, డీఐఈవో

ఎన్నికల వేళ దొంగల హల్‌చల్

కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు భారీగా తరలివస్తారు. ఇదే అదనుగా ఈ నెల 13న నిర్వహించిన వారసంతలో ఒకేరోజు తొమ్మిది మంది సెల్‌ఫోన్లను కేటుగాళ్లు కాజేశారు. కూరగాయలు కొనేందుకు వచ్చి ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- బందోబస్తులో పోలీసులు బిజీబిజీ
- జిల్లా కేంద్రంతోపాటు గ్రామీణ మండలాల్లోనూ పెరిగిన చోరీలు
- వారసంతల్లో రెచ్చిపోతున్న కేటుగాళ్లు



కౌటాల మండల కేంద్రంలోని వార సంత

కౌటాల: ఎన్నికల వేళ జిల్లా వ్యాప్తంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్న కేటుగాళ్లు ఇప్పుడు వారసంతలపై పడ్డారు. వినియోగదారుల జేబులు కాజేస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో గ్రామీణ ప్రాంతాల్లోనూ చోరీలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కార్తీక మాసం ప్రారంభం కావడంతో పెళ్లిలు, శుభకార్యాలు పెరిగాయి. దీంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి శుభకార్యాలకు వెళ్తున్నారు. దీనిని అదనుగా భావించి రాత్రిపూట దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు
జిల్లా కేంద్రంలో ఈ నెల 10న దొంగలు పలు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మరికొన్ని ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఇటీవల కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో అధికంగా దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని మండల కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉన్నా దుండగులు చాకచక్యంగా తమ పని ముగించుకుని బయటపడుతున్నారు. ఎన్నికల కోసం అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లా చెక్‌పోస్టుల్లో నిత్యం తనిఖీలు కొనసాగుతున్నా నిందితులు పట్టుబడటం లేదు. జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్రకు సరిహద్దున ఉన్నాయి. కాగజ్‌నగర్, రెబ్బెన, సిర్పూర్(టి)లో రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. దీంతో పొరుగురాష్ట్రం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు జిల్లాలో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిర్పూర్(టి) మండలానికి సరిహద్దులో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చెక్‌పోస్టులు సైతం ఏర్పాటు చేశారు. అయినా చోరీలు ఆగకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

జూబ్లీ మార్కెట్‌లో జేబుదొంగల బెడద

- మహిళ నుంచి రూ.4 వేలు తస్కరణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జూబ్లీ కూరగాయల మార్కెట్‌లో జేబు దొంగల బెడద పెరుగుతోంది. శనివారం సంత కావడంతో మార్కెట్ రద్దీగా ఉంది. జిల్లా కేంద్రానికి చెందిన బాదామి సోలంకి అనే మహిళ కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఆమె బ్యాగులో ఉన్న రూ.4 వేలకు పైగా నగదును గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారు. జూబ్లీ మార్కెట్‌లో మరో ముగ్గురి డబ్బులు సైతం జేబు దొంగలు తస్కరించినట్లు సమాచారం. మార్కెట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి బందోబస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో కలకలం..
ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు దండయాత్ర చేస్తున్నారు. ఈ నెల 10న పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. ఎవరూ లేని ఇళ్ల నుంచి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలికిడికి కొందరు నిద్రలేవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బజార్‌వాడలో మారుతి కుటుంబ సభ్యులు శుభకార్యం కోసం ఊరికి వెళ్లారు. ఈ నెల 10న ఇంట్లో దొంగలు పడి రూ.98 వేల నగదు, ముప్పావు తులం బంగారం, పది తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వెల్లడించాడు. అదే బజార్‌వాడలోని కె.రమేశ్ ఇంట్లో రూ.2 వేల నగదును అదేరోజు దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే షమీమ్ ఇంట్లోనూ చోరీకి విఫలయత్నం చేశారు. ఇంటి బయట ఆరేసిన దుస్తులను సైతం వదలకుండా పట్టుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు కాలనీలో మోహన్‌దాస్ ఇంట్లో 10వ తేదీన దొంగలు చోరీకి యత్నించినా ఏమీ దొరకలేదు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంటి తాళం పగులకొట్టినా విలువైన వస్తువులు లభించలేదు. ఆ ఇంటి ఎదుట ఉన్న మోహన్‌దాస్ బంధువు ఇంట్లోనూ చోరీకి యత్నించారు.

కౌటాల వారసంతలో చేతివాటం
కౌటాల వారసంతలో ఈ నెల 13న కౌటాల మండల కేంద్రానికి షహీన్ బాబా, లూర్థయ్య, దుర్గం మాధవ్, రాజేశ్వర్, ప్రవీణ్, రవీందర్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. అలాగే సిర్పూర్(టి) మండలం కొమ్ముగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌లతో పాటు మరో ఇద్దరి ఫోన్లు కాజేశారు. బాధితులు వారసంతలో కూరగాయలు కొనుగోలు చేసే సమయంలోనే గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి వెళ్లిన తర్వాత తమ ఫోన్లు కనిపించలేదని వెల్లడించారు. కౌటాల వార సంతలో గతంలో కూడా వినియోగదారుల పర్సులు, డబ్బులు చోరీకి గురైన ఘటనలు ఉన్నాయి. ఫోన్లు పోగొట్టుకున్న వారు మీసేవ కేంద్రాలకు వెళ్లి ఐఎంఈఐ నంబర్‌తో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారసంతలో పోలీస్ భద్రత కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

'మాదిగలను మభ్యపెడుతున్న బీజేపీ'

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ మాదిగలను మభ్యపెడుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మయ్య విమర్శించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని బీజేపీ హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. మాదిగలను మోసం చేసేందుకు మరోసారి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులను ప్రచారానికి రాకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవి, రాష్ట్ర కార్యదర్శి మల్లేశ్, నాయకులు అశోక్, తిరుపతి, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిన ఇంటి ఎదుట బాధితుడు

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బదిరె వెంకటేశ్‌కు చెందిన ఇల్లు శనివారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. సాయంత్రం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు సమీప వ్యవసాయ పంపుసెట్లకు పైపులు అమర్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఈ ప్రమాదంలో రూ.5 వేల నగదు, పిల్లల సర్టిఫికెట్లు, బ్యాగులు, మంచాలు, నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. కాగా, తనకు ప్రభుత్వ సాయమందించి ఆదుకోవాలని కోరుతూ బాధితుడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశాడు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి



కన్నెపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమిని: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. శనివారం కన్నెపల్లి, భీమిని మండలాల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, కన్నెపల్లి, భీమిని ఎస్సైలు నరేశ్, ప్రశాంత్, అశోక్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

భీమారం: పండించిన వరిధాన్యం దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. మండలంలోని భీమారం, పోలంపల్లి, అంకూసాపూర్, పోలంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గతం కన్నా రెట్టింపు స్థాయిలో రైతులు వరి సాగు చేస్తున్నారని తెలిపారు. కొందరు రైతులు ఇప్పటికీ దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ డీపీఎం వేణు, ఏపీఎం త్రియంబక్, సీసీ దర్శనాల శంకర్ పాల్గొన్నారు.

20నుంచి బెల్లంపల్లిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఈనెల 20వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధి రేపల్లెవాడ శివారులోని రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధరతో సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. మార్కెట్ యార్డు పరిధిలోని రైతులు పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

మందమర్రి ఓటర్లే కీలకం

- ఇక్కడ 77,205 మంది ఓటర్లు
- బరిలో 14 మంది అభ్యర్థులు

మండలాల వారీగా ఓటర్లు

మండలం	ఓట్ల సంఖ్య
మందమర్రి	77,205
చెన్నూర్	43,825
కోటపల్లి	25,735
జైపూర్	28,840
భీమారం	12,678
మొత్తం	1,88,283



చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపోటములను ప్రభావితం చేసేది మందమర్రి ఓటర్లే. గతంలో జరిగిన ఎన్నికల విజయావకాశాలను పరిశీలిస్తే.. మందమర్రి ఓటర్లు ఏ పార్టీకి మొగ్గు చూపితే ఆ పార్టీ అభ్యర్థి విజయకేతనం ఎగురవేసిన దాఖలాలున్నాయి. నియోజకవర్గంలో కార్మిక, కర్షక ఓటర్లు కలగలిపి ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో మందమర్రిలోగల కార్మిక కుటుంబాల ఓట్లే గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులు మందమర్రిపైనే ఆశలు పెట్టుకున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 14మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీతో పాటు 10 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఎన్నికలు మరో 12రోజులుండగా అభ్యర్థులంతా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రచారం జోరుగా సాగిస్తున్నారు.

మందమర్రి ఓట్లే అధికం..

చెన్నూర్ నియోజకవర్గంలో మొత్తం 1,88,283 మంది ఓటర్లున్నారు. ఒక మందమర్రి మండలంలోనే 77,205 మంది ఓటర్లుండగా.. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో 1,11,078 మంది ఓటర్లున్నారు. ఇందులో 50 వేలకు పైగా సింగరేణి కార్మికులే ఉన్నారు. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,64,405 మంది ఓటర్లుండగా.. 2023 ఎన్నికల నాటికి సుమారు 20వేలకు పైగా కొత్త ఓటర్లు పెరిగారు.

ఫోన్ చేసి పలకరిస్తూ..

- వలస ఓటర్లపై అభ్యర్థుల గురి

మంచిర్యాలఅర్బన్: 'అన్నా నమస్తే.. మీపిల్లలు ఎక్కడ ఉంటున్నారు.. మీ ఇంట్లో ఆరోట్లున్నాయి. పిల్లలు దూరప్రాంతాల్లో ఉంటే పిలిపించి ఈసారి ఓటు వేసేలా చూడండి..' అంటూ అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు, ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి సెల్‌ఫోన్ సంభాషణలు షురూ అయ్యాయి. జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారు వేర్వేరు కారణాలతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో స్థిరపడటంతో పోలింగ్ సమయానికి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో ఒక్క ఓటు గెలుపోటములను తారుమారు చేస్తుంది. దీంతో పోలింగ్ తేదీ సమీపిస్తుండగా ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి సారిస్తున్నారు. కొలువు, చదువు, వివిధ అవసరాలు, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని సొంత ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు. బదిలీలపై వెళ్లిన ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకు స్థానిక నాయకులతో చర్చలు జరుపుతున్నారు. అవసరమైన రవాణా ఖర్చులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వార్డుల వారీగా నియోజవకర్గంలో ఓటు హక్కు కలిగి వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారి జాబితా సిద్ధం చేసుకున్నారు. ఒకడుగు ముందుకేసి వారిని సెల్‌ఫోన్లో పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వారికి రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటున్నారు.

ముగిసిన గుస్సాడీ సంబురాలు



చిన్నసాకడలో ఇప్పచెట్టు వద్ద పూజలు చేస్తున్న గుస్సాడీలు, ఆదివాసీలు

కెరమెరి మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో పక్షం రోజులుగా కొనసాగిన గుస్సాడీ సంబురాలు శుక్రవారం ముగిశాయి. ఆయా గ్రామాల్లో కోలబోడి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అనంతరం దప్పుచప్పుళ్లతో ఇప్పచెట్ల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ఏత్మాసూర్ దేవతను పూజించి మొక్కు తీర్చుకున్నారు. గుస్సాడీలు నెమలి పింఛం టోపీ, జింక చర్మం, కాళ్ల గజ్జెలు, మెడలోని ఆభరణాలు, పోరీలు, దాండియా కర్రలు, దుస్తులు, దప్పులు ఇప్పచెట్ల వద్ద దాచుకుని పూజలు చేశారు. కులదేవతలకు మొక్కుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలోని జలవనరుల్లో స్నానాలాచరించారు. – కెరమెరి



పెద్దసాకడలో గుస్సాడీల ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు



హట్టిలో కోలాటం ఆడుతున్న దండారీలు



చిన్నసాకడలో భేటింగ్ అవుతున్న ఆదివాసీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 'మోడల్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు జీ శంకర్‌గౌడ్, పీ ప్రశాంత్ మంచిర్యాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వీరు మహబూబాబాద్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

'వాళ్లను దింపితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు'



మాట్లాడుతున్న మహిపాల్ యాదవ్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులను రాజకీయ ఉద్యోగాల నుంచి దింపితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓయూజేఏసీ ప్రచారంలో భాగంగా శనివారం స్థానిక గాంధీ పార్క్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులతో మాట్లాడారు. పదేళ్లలో నోటిఫికేషన్ ద్వారా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఓయూజేఏసీ టీమ్, తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ నాయకులు ప్రేమ్, అలేఖ్య, సీనియర్ న్యాయవాది శరత్‌కుమార్, నటేశ్వర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో కోర్టు స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా జూనియర్ న్యాయవాదులకు ఆయన శిక్షణ ఇచ్చారు. నాలుగు నెలలపాటు ప్రతీ శనివారం ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చట్టాలపై అవగాహన, కేసుల్లో మెలకువలు, న్యాయవాద వృత్తి విధానాలు, పద్ధతులు, కొన్ని కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్లు వివరించారు. శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల కరుణ ఎవరిపైనో!

- జయాపజయాలపై ప్రభావం చూపనున్న ఎస్‌హెచ్‌జీలు
- బెల్లంపల్లి నియోజకవర్గంలో 42,518 మంది సభ్యులు



నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,73,335 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 86,749 మంది ఉండగా.. ఇందులో మహిళా సంఘాల సభ్యులు 42,518 మంది ఉన్నారు. బెల్లంపల్లి మండలంలో మహిళా సంఘాల సభ్యులు 6,851, నెన్నెలలో 6,561, భీమినిలో 3,231, కన్నెపల్లిలో 4,644, కాసిపేటలో 8,164, తాండూర్‌లో 8,500, వేమనపల్లిలో 4,561 మహిళా సంఘాల సభ్యులున్నారు. వారి ఓట్లకు గాలం వేసేందుకు అన్ని పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాలవారీగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. అభ్యర్థులు నేరుగా కాకుండా ఆయా ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి నేతలతో మాట్లాడిస్తున్నారు. వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. మహిళా సంఘాలకు పార్టీల ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలపై కాకుండా స్థానికంగా ఏమి అవసరమో గుర్తించి నివారించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాల భవనాలు, వాటిలో సౌకర్యాలతో పాటు తమకు అనుకూలంగా మారేందుకు ఏమి కావాలో అడుగుతున్నారు. ఈ విషయంలో గ్రామ, మండల స్థాయి సంఘాల నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. అభ్యర్థులు మహిళా సంఘాల సభ్యులతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. మహిళా సంఘాలను మచ్చిక చేసుకుని తమ వైపు ఓట్లు వేసుకునేలా ఎవరికి వారే ప్రయత్నిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఏమి కావాలనే విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. వీవోలు, మండల సమాఖ్యలను సంప్రదించి ఓట్లు తమకు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. డబ్బులతో ప్రలోభపెట్టే చర్యలకు పూనుకున్నట్లు సమాచారం. దీని ద్వారా గంపగుత్తగా సంఘాల ఓట్లన్నీ తమ ఖాతాల్లో పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై అభ్యర్థులు రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అభ్యర్థుల భవిష్యత్‌ను తేల్చే శక్తి మహిళా సంఘాలకు ఉందని చెప్పకనే చెబుతున్నారు. వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ ఓట్లకు ఎలాగైనా గాలం వేయాలని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మెజార్టీ ఓట్లు ఎవరికి పోలైతే వారి గెలుపు ఖాయమని విశ్లేషకులు కూడా భావిస్తున్నారు.

'మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'



చెన్నూర్‌రూరల్: మామిడిలో పూతకు ముందు, పూత సమయం, కాయదశలో సస్యరక్షణ చర్యలు చేపట్టకుంటే దిగుబడి తగ్గుతుందని వ్యవసాయాధికారి తిరుపతి తెలిపారు. మామిడిలో సస్యరక్షణ చర్యలపై ఓ ప్రకటనలో ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలోని బెల్లంపల్లి, జైపూర్, నెన్నెల, భీమిని, కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్ మండలాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు రైతులు మామిడిలో పాటించిన సమగ్ర సాగు పద్ధతులను అనుసరించి నవంబర్‌లో ముదిరిన రెమ్మల్లో పూమొగ్గ ఏర్పడుతుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులతో డిసెంబర్ రెండో వారం నుంచి జనవరి మొదటి వారం వరకు పూమొగ్గలు వస్తాయని పేర్కొన్నారు. ఒక్కోసారి చలి ఎక్కువగా ఉన్నప్పుడు పూమొగ్గలు ఆలస్యంగా కనబడతాయని తెలిపారు. నీటి వసతి ఉన్న తోటల్లో మామిడి చెట్ల పాదుల్లో నీటి తడి అందించాలని సూచించారు. లీటరు నీటికి వెట్టబుల్ సల్ఫర్ ఐదుగ్రాములు కలిపి పిచికారీ చేస్తే పూమొగ్గలన్నీ ఒకేసారి చిగురిస్తాయని తెలిపారు. లీటరు నీటిలో పొటాషియం నైట్రేట్ (మల్టికే) 10గ్రాములతో పాటు యూరియా 10 గ్రాములు కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పద్ధతులు ముందస్తుగా పాటిస్తే పూత బాగా రావడమే కాకుండా, కాయలు కూడా రాలిపోకుండా ఉంటాయని తెలిపారు.

ఈవీఎం–విశేషాలు..

- పారదర్శక ఓటింగ్‌కు భరోసా
- మొదటిసారి 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)

భైంసాటౌన్(ముధోల్): సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) వరకు ఓటింగ్ విధానంలో మార్పులు తెచ్చింది. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి నూతన విధానాలతో పారదర్శక ఓటింగ్‌కు భరోసానిస్తోంది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ కోసం ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితం మిగిలింది. ఈవీఎంలను మొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం..

ఈవీఎం అంటే?

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు జతగా వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉంటుంది.

రవాణా సులభం..

బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణా చాలా సులభం. తేలికంగా, పోర్టబుల్‌గా ఉండడంతో దూరంగా, రోడ్డు సౌకర్యం లేనిప్రాంతాలకు కూడా వీటిని సులభంగా తరలించవచ్చు.

గరిష్టంగా అభ్యర్థుల సంఖ్య, వేసే ఓట్లు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్టంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ.. ఎన్నికల్లో సాధారణంగా 1,500 ఓట్లు నమోదు చేయడానికి మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నారు.

విద్యుత్ లేని ప్రాంతాల్లో..

ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్-ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లోనూ వీటిని వినియోగించవచ్చు.

ఓటు ఎలా వేయవచ్చు?

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూబటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు ఏడు సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

నిర్ధారించుకున్న తర్వాతే పోలింగ్..

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్‌ను నొక్కి ఇప్పటికే 'దాచిన' ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్‌బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీలు వేస్తారు.

పోలైన ఓట్ల సంఖ్య ఇలా తెలుసుకోవచ్చు..

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటివరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఈవీఎంల భద్రత..

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు.

ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటరు ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తరువాతి ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

ఈవీఎం మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్‌లు కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మిషన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు.

కౌంటింగ్ డే..

కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీప్యాట్ స్లిప్‌లను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

రూ.2లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదును ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: ఎన్నికల నియమావళి ఉల్లంఘించి రూ.2లక్షలు నగదు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన రాంపెల్లి వెంకటరమణాచారి శనివారం అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై స్థానిక మెడిలైఫ్ హాస్పిటల్ ప్రాంతంలో తిరుగుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.2లక్షల నగదు లభించగా ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేశారు. ఈ మొత్తాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

'పిల్లల వ్యాక్సినేషన్‌లో అశ్రద్ధ వద్దు'



రామారావుపేటలో తల్లులతో మాట్లాడుతున్న అనిత

జైపూర్: పిల్లల వ్యాక్సినేషన్‌పై అశ్రద్ధ చేయొద్దని, సకాలంలో వ్యాక్సిన్ వేయించాలని జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ అనిత తెలిపారు. శనివారం మండలంలోని జైపూర్, కుందారం ఆస్పత్రి పరిధిలోగల నర్వ, రామారావుపేట గ్రామాల్లో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. సబ్ సెంటర్లలో రికార్డులు పరిశీలించి వ్యాక్సినేషన్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం వ్యాక్సినేషన్ తీసుకున్న పిల్లల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు.